ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 18 ఏప్రిల్ 2024

రోడ్డుకు మట్టి పోయించిన గ్రామస్తులు



చౌదరిగూడ, ఏప్రిల్ 17 : వర్షాలకు రోడ్డుకిరువైపులా మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు మట్టి పోయించారు. బుధవారం తుమ్మలపల్లికి చెందిన అబ్దుల్ అజీజ్, రాములు, వడ్ల బ్రహ్మయ్య, మాణిక్యరావులు ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడి కంకల్ రోడ్డు నుంచి తుమ్మలపల్లి వరకు బీటీ రోడ్డుకు మొరం పోయించారు.

కల్యాణ వైభోగమే!

- కనుల పండువగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు
- ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- భక్తులతో ఆలయాల కిటకిట



మైసిగండిలో ఉత్సవ మూర్తులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17) : శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గ్రామాలు, పట్టణాల్లో కనుల పండువగా జరుపుకున్నారు. బుధవారం తెల్లవారుజామునే రామయ్య సుప్రభాత సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం కల్యాణ మూర్తులను పల్లకీల్లో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకెళ్లారు. అభిజిత్ లగ్న సమయంలో సీతారాముల ఉత్సవమూర్తుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచి కల్యాణాన్ని జరిపించారు. ఉత్సవాలను తిలకించేందుకు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీతారాముల వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. షాబాద్ మండలం సీతారామపురంలో శ్రీరామచంద్రస్వామి ఆలయంలో కల్యాణోత్సవానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డి హాజరయ్యారు.

కడ్తాల్: కడ్తాలలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మైసిగండి రామాలయంలో సీతారాముల పరిణయ వేడుకను వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ లాంఛనాలతో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎండోమెంట్ శాఖ అధికారులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చారు. ఫౌండర్ ట్రస్టీ రమావత్ సిరోలి పంతూ, ఈవో స్నేహలత, ఉత్సవ నిర్వాహకుడు భాస్కర్‌వాగ్దేవి, తహసీల్దార్ ఆర్పీ జ్యోతిఅరుణ్‌లు పట్టువస్త్రాల తరలింపులో పాల్గొన్నారు. వేదపండితులు కల్యాణ క్రతువును జరిపించారు.సాయంత్రం పూజలు కొనసాగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లిమోత్యానాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, బిక్యానాయక్, నర్సింహ, బిచ్యానాయక్, సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్, శేఖర్‌గౌడ్, ఆర్.తులసీరామ్, లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటేశ్, జవహర్‌లాల్ పాల్గొన్నారు.



మైసిగండిలో రాములవారి కల్యాణం

వైభవంగా రథోత్సవం

మైసిగండి శివాలయం వద్ద బుధవారం సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. మూడు రోజులు ఉత్సవాలు జరుగుతాయి. రథోత్సవంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.



యాచారం మండలం నల్లవెల్లిలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



శంషాబాద్ మండలం అమ్మపల్లి ఆలయంలో పాల్గొన్న భక్తులు



కలిసొచ్చిన ఆలస్యం!

పార్లమెంట్ ఎన్నికలతో 'స్థానిక సమరం' లేటు

- జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సర్కార్ ప్రకటన
- దీంతో లెక్కలు చెప్పని అభ్యర్థులకు కలిసొచ్చిన కాలం
- స్థానిక ఎన్నికల ఆలస్యంతో అనర్హత వేటు నుంచి ఉపశమనం
- గత స్థానిక పోరులో లెక్కలు చెప్పని అభ్యర్థుల్లో పట్టరాని ఆనందం

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో లెక్కలు చెప్పని అభ్యర్థులకు పార్లమెంటు ఎన్నికలతో కలిసొచ్చింది. లోక్‌సభ ఎన్నికల కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయి. ఈ ఎన్నికలను జూన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 2019లో స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చులకు సంబంధించి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీలు లెక్కలు చూపకపోవడంతో ఉమ్మడి జిల్లాలో అనేక మంది అభ్యర్థులపై ఎన్నికల సంఘం వేటు వేసింది. వారిపై అనర్హత వేటు గడువు జూన్‌లోపే ముగియనుంది. దీంతో వేటు పడిన వారందరిలో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. ఎగిరి గంతులేస్తున్నారు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఆలస్యం అమృతం.. విషం.. అనే సామెత గుర్తుందా! ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమవుతుందనేది దీని అర్థం. అయితే రాజకీయాలకు కొన్ని లెక్కలు, సామెతలు పూర్తిగా అతకవు అనడానికి ఇదో సాక్ష్యం. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో లెక్కలు చెప్పని అభ్యర్థులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్న విషయం విదితమే. వీరందరూ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికల కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను జూన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అనర్హత వేటు పడిన వారందరిలో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. దీని కారణం వారిపై అనర్హత వేటుకు గడువు జూన్‌లోగానే ముగియనుండడమే. 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో లెక్కలు చూపని కారణంగా ఉమ్మడి జిల్లాలో వేలాది మంది అభ్యర్థులపై ఎన్నికల సంఘం వేటు వేసింది. పంచాయతీ పాలవర్గాల పదవీ కాలం గత ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. అయితే సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన తీసుకొచ్చారు. అలాగే ఎంపీటీసీ, జడ్పీటీసీ పాలవర్గాల గడువు కూడా జూన్ 3, 4 తేదీల్లో ముగియనున్నాయి. ఎంపీటీసీలకు జూన్ 3వ తేదీన, జడ్పీటీసీలకు జూన్ 4వ తేదీన పదవీ కాలం ముగియనుంది. ఇదిలా ఉంటే 2019 జనవరిలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగగా మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. అయితే గత ఎన్నికల సమయంలో ప్రచారానికి సంబంధించిన లెక్కలు సరిగా చూపించకపోవడంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ వేటు వేసింది.

అనర్హత వేటు పడిన అభ్యర్థుల వివరాలు

జిల్లా	సర్పంచులు	వార్డు సభ్యులు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు
రంగారెడ్డి	283	3,208	183	18
వికారాబాద్	238	1,802	191	26
మేడ్చల్	45	489	32	01
మొత్తం	566	5,499	406	45

లెక్కలు చూపని అభ్యర్థులు

ఉమ్మడి జిల్లాలో పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో 6,516 మంది అభ్యర్థులు గత ఎన్నికల లెక్కలు సరిగా చూపించలేదు. నూతన పంచాయతీరాజ్ చట్టం- 2019 ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రతి పైసాకు లెక్కచూపాల్సిందే. ఎన్నికల ఫలితాలు వెలువడిన 45రోజుల్లో అభ్యర్థులందరూ ఖర్చుల వివరాలను అధికారులకు అందచేయాలి. ఎన్నికల్లో ప్రచారానికి ఎంత ఖర్చు చేశారనే వివరాలను అభ్యర్థులు నిర్దేశిత నమూనాల్లో ఎంపీడీవోలకు కొందరు అందజేయగా, మరికొందరు ఇవ్వలేదు. అవగాహన లేక కొందరు..ఇతరాత్ర కారణాల వల్ల మరికొందరు అసలు లెక్కలు చూపలేదు. దీంతో 2021లోనే అలాంటి వారందరికీ నోటీసులు జారీ చేసి తరువాత అనర్హత వేటు వేశారు. నోటీసులు జారీ చేసిన నాటి నుంచి మూడేళ్లపాటు ఎన్నికల్లో పోటీచేయకుండా ఆంక్షలు విధించారు. అనర్హత వేటు పడిన సర్పంచులు, వార్డు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ అభ్యర్థులకు మే నెలాఖరు వరకు నిషేధం ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. షెడ్యూల్ ప్రకారం సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడానికి ముందే ఎన్నికలు నిర్వహిస్తే చాల మంది పోటీ చేసే అవకాశం కోల్పోయేవారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలో జూన్‌లో పెడతామని ప్రకటించడంతో అనర్హత వేటు పడిన వారి ఆశలు చిగురించాయి. ఎన్నికల్లో పాల్గొనకుండా తమపై విధించిన నిషేధిత పరిమితి ఈలోగా ముగియనుండడంతో వారు సంతోషపడుతున్నారు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.5.3లక్షలు పట్టివేత



చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదును సీజ్ చేసిన పోలీసులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాల్మాకుల చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో రూ.5.3లక్షలు పట్టుకున్నారు. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న రంజిత్‌గౌడ్‌కు చెందిన కారు(టీఎస్07 ఎఫ్ఎఫ్ 7128)ను చెక్‌పోస్టు వద్ద ఎస్సై భాస్కర్‌రావు, సిబ్బంది తనిఖీ చేశారు. కారు డిక్కీలో రూ.5.3లక్షలను గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి నామినేషన్లు

- రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు
- భారీ బందోబస్తు.. అభ్యర్థి సహా ఐదుగురికే లోనికి అమనుమతి
- అభ్యర్థులు అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు తప్పక వెల్లడించాలి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17) : లోక్‌సభ ఎన్నికలకు అసలైన ఘట్టం మొదలైంది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ కానుంది. ఇప్పటికే ప్రచారంలో ముందున్న పార్టీలు, అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు. ఇందుకు రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆర్వో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లు తీసుకోరు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. అభ్యర్థులు 25ఏళ్లు నిండిన వారై, ఓటు హక్కు కలిగి ఉండాలి. అయితే అతడు/ఆమె పోటీచేసే నియోజకవర్గంలోని ఐదుగురు ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులు గానీ, వారి ప్రతిపాదకులు గానీ నామినేషన్ దాఖలు చేయొచ్చు. నామినేషన్‌తో పాటు అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలకు సంబంధించిన అఫిడవిట్లు సమార్పించాలి. ప్రతీ అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేస్తారు. నామినేషన్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అయితే అన్నింటికీ కలిపి డిపాజిట్ డబ్బు ఒకసారి చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో 100 మీటర్ల పరిధిలో మూడు వాహనాలనే అనుమతిస్తారు. నామినేషన్ల దాఖలు నుంచి అభ్యర్థుల ఖర్చు లెక్కించనున్నారు. పత్రికల్లో ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఇతర ఖర్చులు అభ్యర్థి ఖర్చు కింద వేస్తారు. వీడియో సర్వెయలెన్స్ టీంలు చిత్రీకరించిన వీడియోలను వీవింగ్ టీంలు పరిశీలించి అకౌంటింగ్ టీంకు పంపుతారు. ఐటీ, జీఎస్టీ, బ్యాంకింగ్, ఎంసీఎంసీ, ఎక్సైజ్ తదితర జాబితాలను పరిశీలిస్తారు. వ్యయాలను నమోదు చేసి ఎన్నికల పరిశీలనకు వచ్చే వ్యయ పరిశీలకులకు ఎప్పటికప్పుడు నివేదిక అందజేస్తారు. ఇప్పటికే ఓటరు జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. నామినేషన్ కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎండలు దంచి కొడుతుండటంతో నామినేషన్ కేంద్రం వద్ద ఆచ్ఛాదనగా ఉండేలా టెంట్లు వేశారు. ప్రతీ లోక్‌సభ అభ్యర్థి గరిష్ఠంగా రూ.95లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ.10వేల వరకు మాత్రమే నగదు రూపంలో ఖర్చు చేయవచ్చు. అంతకన్నా ఎక్కువ ఖర్చు పెడితే చెక్ రూపంలో లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.



నామినేషన్ల కోసం రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు

మేడ్చల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ కార్యాలయం

మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ కలెక్టరేట్‌లో ఈ నెల 18(నేటి) నుంచి 25 వరకు మల్కాజిగిరి స్థానంలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన ద్వారం నుంచే భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి(కలెక్టర్) చాంబర్ నుంచి 100 నుంచి 300మీటర్ల వరకు పోలీసు బలగాల పహారాతో మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. సందర్శకులకు మధ్యాహ్నం 3 తర్వాతే అనుమతి ఉంటుంది. నామినేషన్ల స్వీకరణలో ఘర్షణలు, అల్లర్లకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అభ్యర్థుల ర్యాలీలను రెండు వందల మీటర్ల లోపు నిలిపివేయనున్నారు. మూడు వాహనాలను వంద మీటర్ల వరకు, అక్కడి నుంచి అభ్యర్థితో పాటు మరో నలుగురిని లోనికి అనుమతిస్తారు. ప్రతీ అంశాన్నీ వీడియో చిత్రీకరణ చేస్తారు. కలెక్టరేట్ రెండో బ్లాక్ న్యుఇ ఉద్యోగులను విధులకు అనుమతిస్తారు.

పరిగి, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల భద్రతలో భాగంగా పరిగిలో విధులు నిర్వహిస్తున్న ఎ/46 రామ్ అథోక్-601 ఐటీబీపీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సందీప్‌కలాల్ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని శ్రీకృష్ణ బాలుర హాస్టల్‌లో నవరాత్రి హవన్ పూజన్ బంధరా కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంతో పాటు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, అధికారులు సహపంక్తి భోజనం చేశారు.

ఘనంగా 'హవన్ పూజన్ బంధరా'


హోమంలో పాల్గొన్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్

మక్సూద్ కుటుంబానికి అధికారుల పరామర్శ

మర్పల్లి, ఏప్రిల్ 17: మక్సూద్ కుటుంబానికి తమ వంతు ఆర్థికసాయం అందజేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ జయరాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మక్సూద్ (28) గ్రామంలో మెకానిక్ వర్క్ షాప్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందేవాడు. ఈనెల 12న షాపు వద్ద వాహనాలను వాషింగ్ చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో కుప్పకూలిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఈ జయరాజు, ఏడీ సత్యనారాయణ, డీఈ సంజీవ్, ఏఈ రాంచందర్ బుధవారం మక్సూద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.


మక్సూద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

ఓబీసీ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరేశం



బంట్వారం, ఏప్రిల్ 17 : ఓబీసీ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరేశం ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, స్పీకర్ ప్రసాద్ కుమార్, ఓబీసీ సెల్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేసారు.

కేంద్ర పథకాలే విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తాయి


మర్పల్లి : కోటమర్పల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు


తాండూరు: మరికంబ కాలనీలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

మర్పల్లి, ఏప్రిల్ 17: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కేంద్ర ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయని బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కోటమర్పల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, సంతోష్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకల్లో కొండా తనయుడు

వికారాబాద్/ధారూరు : చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి ధారూరు మండల పరిధిలోని ధారూరు, నాగారం, స్టేషన్ ధారూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్‌లోని రామాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాములోరికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనవెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు పాండుగౌడ్, విశ్వనాథం, రమేశ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, రాజునాయక్, నందు, సాయిగౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


వికారాబాద్ : రామాలయంలో జరిగిన కల్యాణంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న విశ్వజిత్‌రెడ్డి

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

తాండూరు/యాలాల : ప్రతీ ఒక్కరు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని, దేశంలో మోదీ నాయకత్వంలో కొనసాగుతున్న రామరాజ్యం చేవెళ్ల ప్రాంతంలోను రావాలని కొండా సంగీతా రెడ్డి ఆకాంక్షించారు. తాండూరు పట్టణంలోని మరికాంబ కాలనీ, సీసీఐ కాలనీల్లో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తాండూరు పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా యాలాల మండలం జుంటుపల్లి రామస్వామిని సంగీతారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని దేవుడిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

సీతారాముల కల్యాణంలో పాల్గొన్న విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 17 : షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్కూడలోని అమ్మపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి సంగీతారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు

మోదీపై అభిమానంతో..

- వధూవరులను ఆశీర్వదించడంతో పాటు మోదీకి ఓటేయాలంటూ ముద్రించిన పెళ్లి పత్రిక

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ఓ వ్యక్తి ప్రధాని మోదీపై తన అభిమానాన్ని చాటుకున్నాడు. మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు సోదరుడి కొడుకు పెళ్లి ఈనెల 19న జరగనుంది. తన ఇంట్లో జరుగుతున్న వివాహానికి సంబంధించిన పత్రికలు ముద్రించారు. అయితే ఆహ్వానితులకు అందజేసే ఆ పత్రికల్లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను ముద్రించి మా పెళ్లికి మీరు ఇచ్చే బహుమతి 'మోదీ గారికి ఓటేయండి' అంటూ ముద్రించిన పత్రిక ఆకర్షణీయంగా...చర్చనీయాంశంగా మారింది. ఆ పత్రికలను సన్నిహితులు, మిత్రులు, ఆప్తులకు అందజేశారు. అంతేకాకుడా సామాజిక మాధ్యమాల ద్వార పోస్టు చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు.


మోదీకి ఓటు వేయమని ముద్రించిన పెళ్లి పత్రిక

ఘనంగా రాములోరి కల్యాణం

- పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి.. ప్రత్యేక పూజలు

పరిగి/యాలాల, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీరామమందిరంలోని పోస్టాఫీసు, బహార్‌పేట్ హనుమాన్ దేవాలయాల్లో అర్చకులు సీతారాముల కల్యాణం వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిపించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిగిలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా యాలాల మండల పరిధిలోని జుంటుపల్లిలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. వేద పండితులు, భాజాభజంత్రీల మధ్య కొనసాగిన కల్యాణ మహోత్సవం కనుల పండుగగా కొనసాగింది. కల్యాణ మహోత్సవంలో ఎంపీ రంజిత్ రెడ్డి పాల్గొని ప్రత్యేకంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


యాలాల : జుంటుపల్లి రామస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అమ్మపల్లిలో స్పీకర్, ఎంపీ ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని నర్కూడ అమ్మపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, తెలంగాణ డైరీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ ప్రధాన కార్యదర్శి లలిత్ మర్రి, ప్రవీణ్‌రావు, మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, గడ్డం విజయ, ఎంపీటీసీ గౌతమిఅశోక్, రవినాయక్, శ్రీధర్, శేఖర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, జగన్నాథం, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ మెంబర్ గడ్డం సీతా రంజిత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, మల్లేష్, ఆలయ ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


పరిగి : దాసాంజనేయస్వామికి పూజలు చేస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


అమ్మపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


సీతారాంపూర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న టీటీడీ మెంబర్ గడ్డం సీతారంజిత్‌రెడ్డి తదితరులు


కందుకూరు: తిమ్మాపురంలో కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


శంషాబాద్ రూరల్: అమ్మపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్


షాద్‌నగర్ అర్బన్ : శోభయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


అమ్మపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వరెడ్డి దంపతులు


షాబాద్ : సీతారాంపూర్ ఆలయంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతా, తదితరులు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో బుధవారం సీతారాముల కల్యాణం వేద పండితుల సమక్షంలో, కనుల పండువగా, భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి, రామనామస్మరణతో మార్మోగాయి. వేడుకలకు భక్తులు భారీగా హాజరై కల్యాణాన్ని తిలకించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. పలుచోట్ల ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపులు, శోభాయాత్రలు జరిగాయి. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉత్సవాల్లో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


చౌదరిగూడలో శ్రీరాముని శోభాయాత్ర


కేశంపేట : కాకునూర్‌లో సీతారాముల ఊరేగింపు


షాద్‌నగర్‌రూరల్ : వెలిజర్లలో సీతారాముల కల్యాణం


ఆమనగల్లు : కల్యాణంలో న్యాయమూర్తి స్వరూప


కడ్తాల్ : మైసిగండిలో కల్యాణం నిర్వహిస్తున్న అరుణ్‌జ్యోతి, భాస్కర్‌వ్యాదేవి దంపతులు


ఇబ్రహీంపట్నంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


యాచారంలో సీతారాముల విగ్రహాలను ఊరే గిస్తున్న ఎంపీపీ దంపతులు


శంషాబాద్ రూరల్: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, తదితరులు


నందిగామలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


మంచాల : ఆరుట్లలో సీతారాముల కల్యాణం


చేవెళ్లలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు


చేవెళ్ల : శంకర్‌పల్లిలో మండలం సంకేపల్లిలో సీతారాములకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న భక్తులు


చౌదరిగూడలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


మొయినాబాద్ : కల్యాణంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


కొందుర్గులోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు


కొత్తూర్ : ఎస్‌బీ పల్లిలో సీతారాముల విగ్రహాలను ఉరేగిస్తున్న భక్తులు


శంషాబాద్ : మధురానగర్ పోచమ్మగుడిలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


కందుకూరులో కల్యాణం జరిపిస్తున్న భక్తులు


మాడ్గులలో అన్నదానం చేస్తున్న యువకులు

సమర్థవంతంగా ఎన్నికల విధులు


మాట్లాడుతున్న ఎమ్మార్వో రంగారెడ్డి

తలకొండపల్లి, ఏప్రిల్ 17 : సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎక్కడా అలసత్వానికి తావివ్వకూడదని తహసీల్దార్ రంగారెడ్డి సూచించారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మండలంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎమ్మార్వో కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలకు ఎన్నికల విధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వయోవృద్ధులు, దివ్యాంగులను గుర్తించి వారి ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఫారమ్ 12ను సమర్పించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రజాసేవకు పునరంకితమవ్వాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కుచేలుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 17: పదవి విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవకు పునరంకిత కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మీలో దశాబ్దాల పాటు జవాన్ గా సేవలు అందించి పదవి విరమణ చేసిన వెల్దండకు చెందిన కుచేలుడుకు బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో సన్మాన, అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై కుచేలుడును పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాడ్గుల జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంజీవ్ యాదవ్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రకు బయలుదేరిన ముస్లింలు

శంషాబాద్ రూరల్ ఏప్రిల్ 17 : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పలువురు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. బుధవారం ఆల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్వర్యంలో 35 మంది యాత్రికులు తరలివెళ్లారు. మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు పవిత్ర స్దలమైన మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్ధనలు ఉంటాయని చెప్పారు. ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైన మక్కా వెళ్లాలని కోరుకుంటున్నారని అందుకోసం గత 15 ఏళ్లుగా ఆల్‌మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ పేరుతో యాత్రికులను తీసుకెళ్తామని చెప్పారు. ముస్లిం సోదరులను మక్కా, మదీనా పవిత్ర ప్రార్ధన మందిరాలకు తీసుకెళ్లడం అదృష్టంగా బావిస్తున్నానాని చెప్పారు. వచ్చే నెల 1న తిరిగి హైదరాబాద్ చేరుకుంటామని చెప్పారు. ఉమ్రా యాత్రికులను వారి కుటుంబ సభ్యులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సెండాప్ ఇచ్చారు.

నేటి నుంచి 'చిలుకూరు' బ్రహ్మోత్సవాలు


చిలుకూరు బాలాజీ దేవాలయం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 17 : తెలంగాణ తిరుపతిగా వెలుగొందుతున్న చిలుకూరు బాలాజీ దేవాలయం బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగులు, పూలు, విద్యుత్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన ద్వారాం ముందున్న కోనేరును సుందరీకరించారు. క్యూలైన్లలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రానుండడంతో ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు సౌకర్యాలు కల్పించారు.

ఈ నెల 25 వరకు ఉత్సవాలు

వారం రోజుల పాటు కొనసాగనున్న ఆలయ బ్రహోత్సవాల కోసం గురువారం సాయంత్రం సెల్వర్‌కుత్తు, పుట్టమన్ను తీసుకువచ్చి అంకుర్పారణ చేస్తారు. 19న ఉదయం ధ్వజారోహణం, శేషవాహనం పూజలు నిర్వహిస్తారు. అనంతరం గరుత్మంతునికి నైవేద్యం సమర్పిస్తారు. గరుడ ప్రసాదానికి ఈ సారి 10వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకుల అంచనా. 20న గోప వాహనం, హనుమంతు వాహనం, 21న సూర్యప్రభ, బాలాజీ శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 22న వసంతోత్సవం, గజవాహనం, 23న పల్లకీ సేవ నిర్వహించి, రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 24న మహాభిషేకం, అశ్వవాహనం, ఆస్థానసేవ, దోప్‌సేవ, పుష్పాంజలి, 25న చక్రతీర్థం, ధ్వజావరోహణంతో బ్రహోత్సవాలు ముగుస్తాయని నిర్వహకులు చెప్పారు.

ఘనంగా ఈదమ్మ దేవత బోనాలు


బోనాలతో తరలి వస్తున్న భక్తులు

కడ్తాల్, ఏప్రిల్ 17:కడ్తాల మండల కేంద్రంలో ఈదమ్మ దేవత ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఈదమ్మ , మాంధాత దేవత బోనాలు జెల్లి కార్యక్రమం , ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనం కుండలను అలంకరించుకొని ర్యాలీగా ఈదమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వేడుకలో మహిళల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు బయోమైనింగ్

షాద్‌నగర్, ఏప్రిల్ 17 : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోలిపూర్ గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీపి కబురు అందించారు. అక్కడున్న డంప్‌యార్డు వెదజల్లుతున్న దుర్వాసన, నిత్యం నిప్పుతో వస్తున్న దట్టమైన పొగ కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ ఇబ్బందుల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు బయోమైనింగ్ యంత్రాల ద్వారా డంప్‌యార్డులోని చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రపర్చడంతో పాటు, చెత్తను రీసైక్లింగ్ చేసి మున్సిపాలిటీకి ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోలిపూర్ డంపింగ్ యార్డుకు రోజుకు 400 టన్నుల చెత్త వస్తోందని, ఈ యంత్రాల ద్వారా రోజుకు 50 టన్నుల చెత్తను శుభ్రం చేసే వీలుంటుందన్నారు. ఇప్పటి వరకు డంపింగ్ యార్డుతో ఈ ప్రాంతమంతా దుర్వాసన నిండిపోవడంతో స్థానికులు రోగాలు, అనారోగ్యం బారిన పడుతున్నారని, దీన్ని అధిగమించేందుకు రూ.2.5కోట్లతో బయోమైనింగ్ యంత్రాలను సమకూరుస్తున్నామన్నారు. వీటి నిర్వహణను రాంకీ అనే కార్పొరేట్ సంస్థకు అప్పగించావని ఆయన వెల్లడించారు.

ఆసియన్ బ్రౌన్ ఫ్యాక్టరీతో కాలుష్యం


సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న బుద్ధప్రసాద్

చేవెళ్ల, ఏప్రిల్ 17 : ఆసియన్ బ్రౌన్ ఫ్యాక్టరీతో కాలుష్యం ఏర్పడుతోందని తెలంగాణరాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నగరంలో తెలంగాణ రాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు కార్యాలయంలో బోర్డు సెక్రటరీ ఐఏఎస్ బుద్ధప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఉన్న ఆసియన్ బ్రౌన్ ఫ్యాక్టరీ వల్ల చాలా కాలుష్యం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. షాబాద్ మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలోని కుందన్ టెక్స్‌టైల్స్, శంషాబాద్ మండంలోని శ్రీ కృష్ణ డ్రగ్స్ ద్వారా కూడా పర్యావరణ కాలుష్యం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా శివాజీ


శివాజీ

కేశంపేట, ఏప్రిల్ 17 : భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన మల్లుంకర్ శివాజీని నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు పదవి ఇచ్చినందుకు, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని శివాజీ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్యలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్


ప్రభాకర్

ఆమనగల్లు : పోలేపల్లి గ్రామానికిచెందిన వగ్గు ప్రభాకర్ బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రభాకర్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌లకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా రఘుగౌడ్


రఘుగౌడ్

మహేశ్వరం : బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని అమీర్‌పేట గ్రామానికి చెందిన బసవ రఘుగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కమిటీ ఆదేశానుసారం పని చేస్తానని చెప్పారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు పాపయ్యగౌడ్, బొక్కనర్సింహ్మారెడ్డి, టి. యాదీష్, అనంతయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

డబిల్‌గూడ అభివృద్ధి కమిటీ ఎన్నిక


డబిల్‌గూడ అభివృద్ధి కమిటి సభ్యులు

మహేశ్వరం, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని డబిల్‌గూడ గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక కమిటీలను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీగణపతిశివరామాఆంజనేయ ఆలయ కమిటీ చైర్మన్‌గా బుగ్గని చినయాదయ్య, శివాజీ యువజన సంఘం అధ్యక్షుడిగా తెల్లమల్ల భగత్, అంబేద్కర్ యువజనసంఘం అధ్యక్షుడిగా దార జంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి. యాదీష్, మాజీ సర్పంచ్ బి. శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపలు పట్టడానికి వెళ్లిన గిరిజనులపై దాడి

యాచారం, ఏప్రిల్ 17 : చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన గిరిజనులపై పలువురు దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు తక్కళ్లపల్లి తండాకు చెందిన రమావత్‌రాజు, నరేష్, రవీందర్, దరమ్‌చంద్, రవీందర్ అనే వ్యక్తులు తక్కళ్లపల్లి గ్రామంలోని చెన్నారెడ్డి చెరువులో మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో చేపలు పట్టడానికి వెళ్లి చెరువును పరిశీలిస్తున్నారు. వారిలోని ఓ యువకుడు చెరువులోకి దిగగా ఇంతలో తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన లచ్చాలు, రాములు, కేశవులు, రాజు తదితరులు కలిసి గిరిజనులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటనారాయణ చెప్పారు.

ఘనంగా గంధోత్సవం


గంధత్సవంలో ముస్లిం నాయకులు

ఆమనగల్లు , ఏప్రిల్ 17: ఆమనగల్లు పట్టణంలో బుధవారం హజ్రత్ సయ్యద్ జలాలోద్దీన్ షావలి గందోత్సవం కార్యక్రమాన్ని బుధవారం అత్యంత శక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ కలీల్, మహ్మద్ మోజమ్, మహ్మద్ జహంగీర్‌ల ఇంటి నుంచి బయలు దేరిన గందోత్సవం పట్టణ ప్రధాన వీదుల మీదుగా దర్గా వద్దకు చేరుకుంది. అనంతరం మౌలాన అబ్దుల్ వాహెద్ ఆధ్వర్యంలో ప్రత్యేక దువ్వ సలామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గందాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వివిధ మజీద్‌ల అధ్యక్షులు మహ్మద్ మాసూమ్, ఖాదర్ ఖాద్రీ, గౌస్, పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం


రథాలను ప్రారంభిస్తున్న లక్ష్మణ్

ఆమనగల్లు, ఏప్రిల్ 17 : కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని మూడో సారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ్మా అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండ వద్ద బుధవారం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథాలను స్థానిక నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, క్రాంతి, చెన్నకేశవులు, శ్రీకాంత్, శ్రీధర్, సాయి, గిరి, ఉన్నారు.

బీజేపీలో చేరనున్న కడెంపల్లి ?


సదానంద్‌గౌడ్

కొత్తూర్, ఏప్రిల్ 17 : బీఆర్‌ఎస్ నాయకుడు కడెంపల్లి సదానంద్‌గౌడ్ బీఆర్‌ఎస్‌ను వీడనున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకొన్నుట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆయన ఇంటికి వచ్చి బీజేపీలో చేరాలని కోరినట్లు ప్రచారం కొనసాగుతోంది. సదానంద్‌గౌడ్ రెండు దశాబ్దాల పాటు టీడీపీలో కొనసాగి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. గతంలో కొత్తూర్ గ్రామపంచాయతీ పర్సన్ ఇన్‌చార్జిగా సేవలందించారు.